క్లుప్తంగా

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



ఆత్మకూర్: నాట్కో ఫార్మా లిమిటెడ్, నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లను నాట్కో ఫార్మా డాక్టర్ మదన్‌మోహన్ అందజేశారు. బుధవారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో క్లస్టర్ పరిధిలోని 42 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్లు, మందులను అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఫయాజ్‌అహ్మద్, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, విద్యాసాగర్, సురేందర్‌గౌడ్, టీబీ సూపర్‌వైజర్లు ధర్మ, రాంచందర్, ల్యాబ్ టెక్నీషియన్లు దాసు, సాయి, ఆశాలు, వైద్యసిబ్బంది ఉన్నారు.

‘రైతు భరోసా’ డబ్బులు జమ చేయాలి

వీపనగండ్ల: వానాకాలం పంటల సీజన్ ప్రారంభమయిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ చేయాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా డబ్బులు సకాలంలో అందకపోతే రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి, ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండ్ల కృష్ణయ్య, మహబూబ్‌పాషా, రవిప్రసాద్, ఖాజాహుస్సేన్, బాలగౌడ్, నిరంజన్, నాగరాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని బునాదిపురం గ్రామానికి చెందిన శివరాజ్‌యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.75 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయగా.. కాపీని బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ నాయుడు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

బంగారు పుస్తెలతాడు చోరీ: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: రాత్రి వేళ ఆరుబయట నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన ఈ నెల 9వ తేదీ తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షాపురం గ్రామానికి చెందిన జుట్టు తులసమ్మ ఈ నెల 8న రాత్రి సమయంలో భోజనం చేసి ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి అరుగు మీద పడుకుంది. 9వ తేదీ ఉదయం నిద్రలేచి చూడగా ఆమె మెడలో ఉన్న బంగారు 3.5 తులాల పుస్తులతాడుతో పాటుగా డబ్బులు ఉన్న పర్సును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయమై బాధితురాలు తులసమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట రూరల్: నాటవెళ్లిపెద్దతండాకు చెందిన ముడావత్ శంకర్‌నాయక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందాడు. శంకర్‌నాయక్ బీఆర్‌ఎస్ కార్యకర్త కావడంతో పాటు పార్టీలో చురుకుగ్గా పని చేస్తుండేవాడు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం నాటవెళ్లిపెద్దతండాకు చేరుకుని శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, ఆకుల శ్రీనివాసులు, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, నెహ్రూ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూర్: ఒక డైరెక్టర్ స్టోరీ తెలుగు వెబ్‌సీరీస్ పోస్టర్‌ను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఓ ఫంక్షన్ హాల్‌లో డైరెక్టర్ దేవా మాస్టర్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న వెబ్ సీరీస్‌తో పాటు రాష్ట్ర స్థాయి డాన్స్ కాంపిటీషన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చిన్నారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రాండ్‌మాస్టర్ రవి, మాస్టర్లు చిన్న, శ్రీనివాస్, నిర్మాత అంబాజీ ఉన్నారు.

‘ఉపాధి’ సోషల్ ఆడిట్

చిన్నంబావి: 2024–25 సంవత్సరంలో మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఎంపీడీఓ రమణరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల రికార్డులను పరిశీలించిన డీఆర్‌పీలు వాటి నివేదికలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ ఉమాదేవి హాజరై, ఉపాధి పనుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సత్యనారాయణ, డీపీఓ రహీం, క్యూసీ హరిత, పంచాయతీరాజ్ ఏఈ మస్తాన్, ఎస్‌ఆర్‌పీ రమేష్ పాల్గొన్నారు.

సర్కార్ బడి.. చదువుల ఒడి



పాన్‌గల్‌లో బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

- కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం

పాన్‌గల్: ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడికి వచ్చేలా ఉపాధ్యాయులు బడిబాట నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే మౌలిక వసతులు, ఉచితాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఐదేళ్లు నిండే చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో గుర్తించి వారిని సర్కార్ బడి బాట పట్టేలా ముందుగానే అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదు, ఏడో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల వివరాలను సేకరించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పంపాలని కోరుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని తేడాలు, ఫీజులు, ఒత్తిడి లేని విద్య, క్రీడలు, పోటీ పరీక్షలు, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరును వివరిస్తున్నారు.

మండలాల వారీగా..		
మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
చిన్నంబావి	30	1718
పాన్‌గల్	50	3603
వీపనగండ్ల	26	1633

సదుపాయాలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు విద్యతో పాటు పాఠ్య, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, ఆధునిక డిజిటల్ బోధన, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, వారంలో మూడు సార్లు గుడ్లు, దివ్యాంగ చిన్నారులను బడికి తీసుకొచ్చే తల్లిదండ్రులకు భత్యం, రవాణా సౌకర్యం లేని గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం, విశాలమైన మైదానాలు, అనుభవజ్ఞులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వంటి సౌకర్యాలు ఉండనున్నాయి.

నమ్మకం పెంచాలి



ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించడంతో పాటు ఉపాధ్యాయులు అందిస్తున్న విద్యను తెలియపరుస్తూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించాలి. గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల తోడ్పాటు కూడా ఎంతో అవసరం. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు లేరని మూతపడిన పాఠశాలలను తిరిగి కొనసాగించాలి.

– బాల్యనాయక్, తెల్లరాళ్లపల్లితండా

నాణ్యమైన విద్య



నా కొడుకు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే నాలుగేళ్లుగా చదివిస్తున్నా. నాణ్యమైన విద్య అందుతుండటంతో తెలుగు, ఇంగ్లిష్‌లో మా అబ్బాయి మంచి పట్టు సాధించా. పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

– గోపిక, విద్యార్థి తల్లి, పాన్‌గల్

ప్రైవేట్‌కు దీటుగా..



ప్రైవేటు కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఎక్కువగా ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పాటు ఎంఈఓ కూడా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. గతంలో మాదిరిగా ఉపాధ్యాయుల కొరత లేదు. బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ఇటీవల గురుకుల ప్రవేశ పరీక్షల్లో మండలం నుంచి 90మందికి పైగా విద్యార్థులు సీట్లు సాధించారు.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

కనులపండువగా లక్ష్మీవేంకటేశ్వర కల్యాణోత్సవం



అమరచింతలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో గల వేంకటేశ్వర ఆలయంలో బుధవారం లక్ష్మీవేంకటేశ్వరుడి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయంలో హోమం నిర్వహించిన అర్చకులు ఆశ్రమ పండితుడు బ్రహ్మశ్రీ కొల్లూరి భీమాచార్యుల సమక్షంలో లక్ష్మీఅలివేల సమేతంగా వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. ప్రతి సంవత్సరం జేష్టశుద్ధ పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. జల్లాపురం రామకృష్ణారెడ్డి బృందం వారిచే అన్నమాచార్యుల సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు వసతులను ఆలయ కమిటీ ద్వారా ఏర్పాటు చేసినట్లు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. అర్చకులు వేదమంత్రాలతో సంకల్ప పూజలతో మాంగళ్య పూజలు చేసి జరిపించగా భక్తులు తలంబ్రాలు పోశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో కొత్తకోట విద్యార్థుల ప్రతిభ



డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన చిన్నారులు

కొత్తకోట: మండలంలోని చిన్నారులు వేసవి సెలవుల్లో డ్యాన్స్ శిక్షణ పొంది వారం రోజుల కిందట హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారతీయ కళా వైభవం వారిచే నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు ప్రతిభ చూపి బహుమతులు, ప్రశంసా పత్రాలు గెలుచుకున్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ బన్నీని బెస్ట్ కొరియోగ్రాఫర్‌గా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ పాల్గొని వారిని చిన్నారులు, మాస్టర్ బన్నీని అభినందించారు. కార్యక్రమంలో భరత్‌భూషణ్, రవీందర్‌రెడ్డి, నారాయణమ్మ, సుభాష్, మేస్త్రీ శ్రీను, లక్ష్మారెడ్డి, గంగాధర్, బాలకృష్ణ, గోకరయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

సామాజిక భద్రత పథకాల్లో భాగస్వాములవ్వాలి

ఖిల్లాఘనపురం: బ్యాంకుల ద్వారా అందిస్తున్న సామాజిక భద్రత పథకాల్లో ఖాతాదారులు భాగస్వాములు కావాలని ఏఎంహెచ్ హబ్ ప్రాసెసింగ్ అధికారి అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని మామిడిమడ గ్రామంలో భూత్పూర్ మండలంలోని వెల్కిచెర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌ఐసీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్‌తో కలిసి హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ప్రధానమంత్రి సూర్యఘర్ రుణాలు, రైతు నేస్తం, పౌల్ట్రీ, డైరీ, గొర్రెల పెంపకం, ముద్ర రుణాలతో పాటుగా సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన లాంటి పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. జీపీఏఐ పర్సనల్ ప్రమాద బీమా సంవత్సరానికి రూ.2 వేలు చెల్లిస్తే సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.40 లక్షలు వస్తాయన్నారు. నూతనంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మార్ట్‌గేజ్‌లోన్లు ఇస్తామన్నారు. పంట రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్న రైతులకు ఎకరా భూమి ఉన్నా రూ.3 లక్షల రుణం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ హన్మంతునాయుడు, బ్యాంక్ మిత్ర షాహీన్ బేగం ఖాతాదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కొప్పునూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వనపర్తి రూరల్: రైతులు తమ పొలానికి సంబంధించి భూసార పరీక్షలను చేయించుకోవాలని భారత నూనె గింజల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ అన్నారు. బుధవారం మండలంలోని మెంటెపల్లి, నాచహళ్లి, దత్తాయిపల్లి, శ్రీనివాసపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేవీకే శాస్త్రవేతలు వానాకాలంలో పండించే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలు సాగు పెంపొందించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేతలు రాజేందర్‌రెడ్డి, డాక్టర్ అనిత, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఇన్‌చార్జ్ రవిసాగర్, ఏఈఓలు యుగేంధర్, శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీకాంత్, ఎఫ్‌ఏ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

చిన్నంబావి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొప్పునూరులో రైతులతో శాస్త్రవేత్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పంటల సాగు, యూరియా, రసాయనిక ఎరువుల వాడకం, సాగు ఖర్చు తగ్గించడం, పంట మార్పిడి, భూసారం కాపాడటం, వివిధ పంటలపై చీడపీడల నియంత్రణ చేయడం వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త విజయలక్ష్మి, రామిరెడ్డి, ఏడీఓ చంద్రశేఖర్, ఏఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్: మండల కేంద్రం శివారులో గ్రామ పంచాయతీకి సంబంధించిన బెల్లెస్‌గుట్టను ఆక్రమిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం పంచాయతీ కార్యదర్శి, ఆర్‌ఐకి గ్రామస్తుడు ఆది స్వామి ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో సర్వేనెం.114/అ/అ2 లో 6 ఎకరాల 23 గుంటల భూమి ఉంది. ఈ భూమిని ఆసరా చేసుకొని సమీపంలోని గ్రామ పంచాయతీకి సంబంధించిన గుట్టను జేసీబీ సహాయంతో ఆక్రమించుకునేందుకు ఎండీ గౌస్ ప్రయత్నిస్తూ గుట్టను చదును చేస్తున్నాడని ఆరోపించాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపి జీపీకి సంబంధించిన భూమి ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

ఆత్మకూర్: తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ ట్రాక్టర్‌కు అందించాలని పట్టణ ప్రజలకు కమిషనర్ చికినె శశిధర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆత్మకూర్‌లోని డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించారు. దోమల నివారణ కోసం పట్టణంలో ప్రతిరోజు ఫాగింగ్ చేస్తున్నామని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. పారిశుద్ధ్యం, వన మహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణాలు, తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

కొత్తకోట: పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో 13 వాగ్దానాలు ఉన్నాయన్నారు. అందులో భాగంగా ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందిస్తామన్నారని గుర్తు చేశారు. వృద్ధులకు పెన్షన్ రూ.4 వేలు, మహిళలకు రూ.2,500 ఇస్తామని ప్రభుత్వం చెప్పిన హామీలు అమలు కాలేదన్నారు. పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, ప్రజా పాలనలో మొత్తం 3,600 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో 146 మందికి మాత్రమే ఇళ్ల నిర్మాణం కోసం కలెక్టర్ ద్వారా ప్రొసీడింగ్ వచ్చినట్లు చెబుతున్నారన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: పట్టణంలోని పీర్లగుట్టకు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 6న విద్యుదాఘాతానికి గురై హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పీర్లగుట్టకు చెందిన రామకృష్ణ (60) ఈ నెల 06 న పోలీస్ క్వార్టర్స్ పక్కన గల ట్రాన్స్‌పార్మర్‌కు అల్లుకొని ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు వైర్లు తగిలి షాక్ గురై కిందపడిపోయాడు. అక్కడే ఉన్న చిన్నారులు చూసి బాధితుడి భార్య పెబ్బేటి మనెమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి వచ్చి అతడి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రామకృష్ణ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మనెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సీహెచ్‌ఓ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని వెంగళాయిపల్లిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలను సకాలంలో వేయించుకోవడంతో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుంది అని తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు(ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమాదేవి, శైలజ, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ



మక్తల్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని సత్కరిస్తున్న దేవరపల్లి గ్రామస్తులు

ఆత్మకూర్: రాష్ట్ర మంత్రి, మక్తల్ శాసనసభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరిని దేవరపల్లి గ్రామస్తులు మక్తల్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిసి సత్కరించారు. నియోజకవర్గానికి మంత్రి పదవి లభించడంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగన్న, కాంగ్రెస్ నాయకులు దశరథ్, రాములు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల ముదిరాజ్ సంఘం నాయకులు గోనెల బాలస్వామి, గోనెల సహదేవ్, బాలరాజు, సొప్పరి బీచుపల్లి, ఎల్లస్వామి, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులతో కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ హైదరాబాద్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి శాలువాతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో రాజీవ్‌రెడ్డి, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ సారథ్యంలో నాలుగో ఆర్థిక శక్తిగా భారత్’



రేవల్లిలో మాట్లాడుతున్న ప్రవీణ్

కొత్తకోట రూరల్: కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రధాని మోదీ సారథ్యంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి అందేలా కార్యకర్తలు చొరువ చూపాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిపించేందుకు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు సుక్క మధు, చిట్యాల దత్తాత్రేయరెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు రుక్మారెడ్డి, సరస్వతి, ముప్పూరి రామస్వామి, బోయ బాలరాజు, నాగరాజు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పదకొండేళ్లలో మేకిన్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్ భారత్, డిజిటల్ ఇండియా వంటి పథకాలతో ప్రధాని మోదీ సారథ్యంలో ఎంతో అభివృద్ధి సాధించామని రేవల్లి మండల బీజేపీ ఇన్‌చార్జ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గందం ప్రవీణ్ అన్నారు. బుధవారం రేవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు మోదీ కృషి ఎంతో ఉందన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని ముందుకు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలునాయక్, కౌన్సిల్ సభ్యుడు అజయ్‌గౌడ్, మేకల కృష్ణ, లింగస్వామి, తిరుపతి, రాము, జమ్ములు, పరశురాములు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ పాలనలో పేదల డబ్బులు దండుకున్నారు’



మదనాపురంలో మట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు దండుకున్నారని, అలాంటి నైజం కాంగ్రెస్ పార్టీకి లేదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, వీటి నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా 1000 ఇళ్లు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చెర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చెర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్ పావని, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ జేకే మోహన్ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి



కనిమెట్టలో ర్యాలీ నిర్వహిస్తున అంగన్‌వాడీ టీచర్, పీఎస్ ప్రధానోపాధ్యాయుడు

సాక్షి, నెట్‌వర్క్: ‘అమ్మ మాట అంగన్‌వాడీ బాట’ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులతో కలిసి జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాలకు వారిని పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, వసతుల గురించి వివరించారు.

- కొత్తకోట మండలంలోని కనిమెట్టలో చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి, పీఎస్ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య ర్యాలీ నిర్వహించారు.
- పాన్‌గల్ మండలంలోని దావాజిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ సీడీపీఓ బాలీశ్వరీ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, చరిత, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- వీపనగండ్ల మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ వంటకం తయారు చేసి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి, కృష్ణమ్మ, పారిజాత, చంద్రకళ, మాధవి అన్నారు.
- వనపర్తి మండలంలోని చిట్యాల పడమటితండా అంగన్‌వాడీ టీచర్ శ్రీలత చిన్నారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



తూంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రెవెన్యూ అధికారులు అన్నారు. బుధవారం జిల్లావ్యాప్తంగా అధికారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వేగంగా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

- ఆత్మకూర్ మండలలోని తూంపల్లి, తిప్డంపల్లి గ్రామాల్లో 11 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ షేక్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- పాన్‌గల్ మండలంలోని మాధరావుపల్లిలో 6, మల్లాయిపల్లిలో 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.
- అమరచింత మండల కేంద్రంలో 30 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐలు వెంకటయ్య, గోపాల్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.
- వనపర్తి మండలంలోని వెంకటాపురంలో 12, అప్పాయిపల్లిలో 14 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి తెలిపారు.
- పెబ్బేరు మండలంలోని భూడ్డిపాడులో తహసీల్దార్ మురళీగౌడ్ 2, తోమాలపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 6 దరఖాస్తులు స్వీకరించారు. శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురంలో తహసీల్దార్ రాజు పాల్గొని 33 దరఖాస్తులు తీసుకున్నారు.
- ఖిల్లాఘనపురం మండలంలోని ఉప్పరిపల్లి 15, సూరాయపల్లిలో 8 ఫిర్యాదులు స్వీకరించినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంటు కురుమూర్తి, ఆర్‌ఐ తిరుపతయ్య పలువురు సిబ్బంది పాల్గొన్నారు.